బియ్యం బకాసురులు

28-30 తేదీల్లో సీపీఐ జిల్లా శాఖ కార్యదర్శుల వర్క్‌షాపు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఈనెల 28, 29, 30 తేదీలలో రాజమండ్రిలో జరగనున్న సిపిఐ జిల్లాస్థాయి శాఖ కార్యదర్శుల వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పాలకులు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ ప్రజా సంఘాల శ్రేణులు ను చైతన్యం చేయడం కోసం పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం కోసం ఈ వర్క్ షాప్ ను జరుపుతున్నామని మధు తెలియజేశారు. ఈ నెల 12 నుండి పోలవరం ప్రాజెక్టు కోసం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం జీపు జాత ప్రారంభిస్తున్నామని ఈనెల 23న పోలవరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. దీనిని అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే జ్యోతి రాజు, చింతలపూడి సునీల్, సహాయ కార్యదర్శి సప్పరమణ, ఎస్. నౌరోజి తదితరులు పాల్గొన్నారు.

30 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రామవరం గ్రామంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్‌కు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించి సారా అమ్ముతున్న రామవరం గ్రామానికి చెందిన తోట వీరన్నను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - అంబాజీపేట : పి గన్నవరం మండలంలోని ముంగండపాలెం ముంజువరపుకొట్టు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రాబిన్ హుడ్ ఆర్మీ సహాయ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అఖిల్, మోహన్ సాయి, అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో పెద్దవాళ్లకు, వృద్ధులకు, గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తామని వారు తెలిపారు. స్థానికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు.

అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కారం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన అర్జీదార్ల సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఇటీవలే ఏలేశ్వరం తహసీల్దారుగా పదవీ బాధ్యతలు చేపట్టిన జి. చిన్నారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోరుతూ కార్యాల యానికి వచ్చే అర్జీదారులు నేరుగా తనను కలవడం ద్వారా వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఎస్. సూరపరాజు జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో గండేపల్లి నుండి బదిలీపై ఏలేశ్వరం వచ్చినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జి. రవి, వీఆర్వోలు అవసరాల కిషోర్, రొంగల శ్రీనివాస్, మశిరపు అప్పారావు, కొట్టేటి సత్యరావు, కొట్టేటి చంటిబాబు, మాన్యాల బాలరాజు, ఇ. భారతి, చిన్నారి తదితరులు నూతన తహసీల్దార్‌ను అభినందించారు.

నేడు చింతలపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని చింతలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు శనివారం ఉదయం 9 గంటల నుండి శ్రీరామ్ ఐ కేర్ & రెటీనా సెంటర్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ మట్ట ప్రసన్న కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రైతు భరోసా కేంద్రాలు రైతులకు మేలుకరంగా ఉండాలి

విశాలాంధ్ర - గోపాలపురం : రైతు భరోసా కేంద్రాలు రైతులకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్న సందర్భంగా రైతులకు రైతు భరోసా కేంద్రాలు, పంటలపై సూచనలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రతి పథకం ప్రతి రైతుకు చేరేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ సీజన్లో వారం వారం ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు పంటల సాగు ప్రణాళికను రూపొందిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీతల ప్రసాద్, వ్యవసాయ ఉద్యానవన సిబ్బంది, వ్యవసాయ యంత్ర సేవ పథకం కన్వీనర్ కోకన్వీనర్లు హాజరయ్యారు.

అధికారులకు సమస్యలు విన్నవించిన ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర - సీతానగరం: పలు సమస్యలు అధికారుల ముందుకు తీసుకొని వచ్చిన ప్రజా ప్రతినిధులు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంకు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన వహించగా జెడ్పీటీసీ చలమల సుజిరాజు, మండల ప్రత్యేక అధికారి ఏ పి డి శ్రీనివాస్, ఎంపిడిఓ కె రమేష్ నిర్వహించారు. దీనిలో పలు గ్రామాలు ప్రజా ప్రతినిధులు సమస్యలను అధికారుల ముందుకు తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ రాజు, ఏ ఓ గోపాల్, సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, కో కన్వీనర్ హరిబాబు, అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ పరీక్షలో సత్తా చాటిన శ్రీ మహతి

విశాలాంధ్ర - సీతానగరం: ఏపి అర్ జేసీ పరీక్షలో శ్రీ మహతి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కరస్పాండెంట్ ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపి అర్ జేసీ పరీక్షలో స్టేట్ లెవెల్ లో పాతూరి వెంకటేష్ 5వ, కె హోజత్ 30వ, ఏమ్ సృజన 61వ, వై రూప దేవి 65వ, ఆర్. సాయి వినయ్ 66వ, కృప నందన్ పైను 98వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

విద్యుత్ చార్జీల మోత

విశాలాంధ్ర - కొత్తపేట : రాష్ట్రంలో ఎడాపెడా విద్యుత్ కోతలతో పాటు చార్జీలు మోత మోగుతున్నదని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు విమర్శించారు. వాడపాలెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగటు వినియోగదారుడు మూడు రెట్లు అధికంగా చార్జీలు చెల్లించ వలసి రావడంతో ఆందోళన చెందుతున్నాడని, ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరా అందించలేక చార్జీల భారం మోపుతుందన్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధులు వరకు విద్యుత్ కోతలకు అల్లాడుతున్నారని తెలిపారు. సమావేశంలో కొత్తపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో జోరుగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

విశాలాంధ్ర - మామిడికుదురు : పేద ప్రజల ఆహార భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం కోనసీమ జిల్లాలో పక్కదారి పడుతున్నాయి. పేదల ఆహారం కోసం అందించే రేషన్ బియ్యం అక్రమార్కులకు వ్యాపార వస్తువుగా మారి కాసులు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా నేటి రోజుల్లో ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎక్కువ మంది తినడం లేదు. ఒక అంచనా ప్రకారం లబ్ధిదారుల్లో 60 శాతం మంది రేషన్ బియ్యం తినడం ఎప్పుడో మానేశారు. ప్రభుత్వం అందించే బియ్యం వద్దు అనడం ఎందుకు అని ప్రతి నెల ఇంటింటికీ వచ్చే రేషన్ తీసుకుంటున్నారు. దానితో లబ్ధిదారుల వద్ద రేషన్ బియ్యం పేరుకు పోతు న్నాయి. అదే అక్రమార్కులకు వరంగా మారింది. ఇంట్లో పేరుకుపోయిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు కొనుగోలుదారులకు కిలోకి పది నుండి పదిహేను రూపాయల చొప్పున అమ్ముకుంటున్నారు.

బియ్యం కొంటాం.. రేషన్ బియ్యం..! : మామిడికుదురు మండలంలోని వివిధ గ్రామాల్లో తెల్లవారింది మొదలు బియ్యం ఉన్నాయా రేషన్ బియ్యం.. మేము కొంటాం అంటూ కొందరు వ్యక్తులు ప్రత్యక్షమై గ్రామంలోని ప్రతి ఇల్లు తిరుగుతూ బియ్యం సేకరిస్తున్నారు. ఉదయం సేకరించిన బియ్యాన్ని నమ్మకస్తులైన ఒక ఇంట్లో పెట్టి చీకటి పడిన తర్వాత ద్విచక్ర వాహనంపై వారి ప్రాంతానికి తరలిస్తున్నారు. అలా వివిధ గ్రామాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని తమ గ్రామాలలో నిలువ ఉంచి అదును చూసి రైస్ మిల్లుకు తరలించి కిలోకు 20 నుండి 25 రూపాయలకు అమ్ముకుంటున్నారు. అక్రమంగా ఇలా కొన్న బియ్యాన్ని రైస్ మిల్లర్లు పక్క రాష్ట్రాలకు తరలించి క్యాష్ చేసుకుంటున్నారు.

అరకొర దాడులు - పట్టించుకోని అక్రమార్కులు : మామిడికుదురు మండలం కేంద్రంలో బహిరంగంగా పీడీఎస్ రైస్ వ్యాపారం జరుగుతున్న స్థానిక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్ళినపుడు అరకొరగా దాడులు నిర్వహించి చేతులు దులుపేసుకుంటున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బియ్యం వ్యాపారం చేస్తున్న సూత్ర దారులు పై కేసులు లేకుండా వాహ నాలు నడిపే డ్రైవర్లు, పనిచేసే కార్మికులు పై కేసులు నమోదు చేయడం వల్ల ఉపయోగం లేదని అక్రమ రవాణా మూలాలు పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తుంది. వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మామిడికుదురు మండల పరిధిలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం చూస్తుంటే వీరి వ్యాపారం ఏ మేరకు ఉందో ఊహించుకోవచ్చు. విజిలెన్స్ అధికారులు ఈ నెల 5వ తేదీన నగరంలో పీడీఎస్ రైస్ వాహనాన్ని పట్టుకోగా సుమారు 4 లక్షలు రూపాయలు విలువ చేసే 2 మెట్రిక్ టన్నులు బియ్యం సీజ్ చేశారు. ఆ ఘటన మరువకముందే శుక్రవారం మామిడికుదురులో ప్రధాన రహదారి చెంతన ఉన్న ఒక బియ్యం వ్యాపారి ఇంట్లో దాడులు జరిపి కేసు నమోదు చేశారు. అంతకుముందే అధికారులు కళ్లుగప్పి బియ్యం రవాణా జరిగిపోగా కొంత మొత్తంలో నిల్వ ఉంచిన దాన్ని అధికారులు పట్టుకున్నారు. మామిడికుదురు మండలంలో బియ్యం అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుందో వారం రోజుల వ్యవధిలో విజిలెన్స్ అధికారులు రెండు సార్లు దాడులు నిర్వహించడం పట్ల స్పష్టమవుతోంది.

నిబంధనలకు వ్యతిరేకంగా చేపల చెరువులు సాగు చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులను సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం పలు గ్రామాల్లో ఉన్న చేపల చెరువుల్లో వేస్తున్న కోళ్ల వ్యర్థాలు, కుళ్ళిన మాంసము, గొడ్డు మాంసాన్ని నిరంతరం వాహనాల్లో తరలించి చేపల చెరువుల్లో వేస్తున్నారు. కుళ్ళిన వ్యర్థాలను తరచూ తరలించడం వల్ల దుర్గంధ భరితమైన వాతావరణంలో ఆయా మార్గాలలో ముక్కు మూసుకుని వెళ్ళవలసి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ, రెవెన్యూ,పోలీస్ సిబ్బంది శుక్రవారం మండలంలోని వీరవరం, రామచంద్రాపురం, తామరాడ, ఎస్ తిమ్మాపురం, భూపాలపట్నం గ్రామాల పరిధిలో ఉన్న చేపల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడి సత్యనారాయణ మాట్లాడుతూ చేపల చెరువుల్లో కేవలం తౌడు వేరుశనగ చెక్క మాత్రమే మేతగా వేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కుళ్లిన కోడి వ్యర్థాలను వేసి చేపల చెరువులను సాగు చేసి, పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపల చెరువుల లైసెన్సులను రద్దుచేసి అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ తాళ్లరేవు డివిజన్ ఏడి లావణ్య, కిర్లంపూడి ఎస్సై, టీ రఘునాథరావు, ఏఎస్సై కుమార్, మత్స్య శాఖ ఇన్స్పెక్టర్ రాజేంద్ర, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ మౌనిక, రెవిన్యూ సిబ్బంది, కిర్లంపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల మత్స్య శాఖ సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా

పక్కా బిల్డింగుల నిర్మాణానికి పునాదులు

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రభుత్వ స్థలం చూసెయ్ కబ్జా చేసెయ్ అన్న చందంగా ఉన్నారు జగ్గంపేట నియోజకవర్గంలోని పెత్తందార్లు. పుష్కర, పోలవరం కాలువల కోసం తీసుకున్న స్థలాలను కబ్జా చేస్తున్నారు. కాలువలు త్రవ్వి పెద్ద, పెద్ద గట్లుగా వేశారు. ఆ మట్టి తరలించుకుపోవడంతో కాలువ ప్రక్క స్థలాలు సమాంతరంగా మారాయి. వాటిని కబ్జా చేసి తనవాళ్ళ అనుకున్నవారికి వారి సొంత స్థలాలుగా ధారాదత్తం చేస్తున్నారు. ఇక రహదారుల ప్రక్కనున్న విలువైన స్థలాలైతే కోట్లలో అమ్మకాలు జరిగిపోతున్నాయి. అధికారులు ఎక్కడైనా పట్టించుకుంటే రాజకీయ ఒత్తిళ్ల ఎదురవుతున్నాయి. దీంతో వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అదే తరహాలో జగ్గంపేట పట్టణం శ్రీరామ్ నగర్‌కు అనుకుని ఉన్న పుష్కర కాలువ స్థలంలో పక్కా బిల్డింగ్ నిర్మాణం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు. పుష్కర అధికారులకు ఫిర్యాదు అందడంతో వారు చేసేది ఏమిలేక అక్కడికి వెళ్లి నిర్మాణం చేపట్టేవారికి నోటీసులు ఇచ్చారు. అక్రమ నిర్మాణంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోకవరం రోడ్డులో రహదారి ప్రక్కనే గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట పరిధిలోని మరో పుష్కర కాలువ స్థలం ఆక్రమణకు గురైంది. గతంలో అక్రమ నిర్మాణం చేయబోతే అప్పుడు అధికారులు అడ్డుకున్నారు. ఇప్పుడు అవి చేతులు మారి కోట్లలో అమ్మకాలు జరిగాయి. నూతనంగా కొనుగోలు చేసిన వారు మరలా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే పుష్కర అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో వారు అక్కడ నోటీసు బోర్డు పెట్టారు. ఇలా అనేక ప్రభుత్వ, ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురై పక్కా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి కబ్జా స్థలాలపైన, అక్రమ నిర్మాణాలపైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు..

క్షేత్రస్థాయికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - అనపర్తి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పార్టీ అనుబంధం సంఘాల ఇన్‌చార్జి విజయ సాయి రెడ్డి ఆదేశించినట్లు జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాస రెడ్డి (ఎస్ఎస్) తెలిపారు.శుక్రవారం తాడేపల్లిలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు, కన్వీనర్లతో అనుబంధ సంఘాల ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో తాను పాల్గొన్నట్లు ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి చెప్పారు.

పవన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - రాజానగరం : రానున్న ఎన్నికల్లో జనసేన గెలుపు తథ్యం అని, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన నియోజకవర్గ నాయకులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే వివిధ సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న బత్తుల బలరామ కృష్ణ వరహి యాత్ర ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో మరింత స్పీడ్ పెంచి గ్రామాల్లో వరస బైక్ ర్యాలీలు,జనంకోసం జనసేన మహాపాదయాత్రలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని రఘునాథపురం గ్రామంలో గత రెండు రోజులుగా జరిగిన పాదయాత్ర శుక్రవారం సైతం మంచి జోష్ పై సాగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, జనసైనికులు భారీగా పాల్గొన్నారు.

ఐఐఎఫ్‌టీ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : భారతీయ విదేశీ వాణిజ్య సంస్థ(ఐఐఎఫ్‌టీ) శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కాకినాడ జేఎన్టీయూలో తాత్కాలిక భవనంలో భారతీయ విదేశీ వాణిజ్య సంస్థ ఏర్పాటు చేయగా యూ.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామంలో శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఇందుకు వివిధ శాఖలతో సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు డాక్టర్‌కృతికాశుక్లా, రెవిన్యూ, కూడా, పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక, భూగర్భ జలాలు, అటవీ, కాలుష్య నియంత్రణ మండలి, కెఎస్ఈజెడ్ తదితర శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన తొలి దశ అనుమతులు, ఇతర అంశాలపై సమావేశంలో కలెక్టరు కృతికా శుక్లా అధికారులతో ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ కాకినాడ ఐఐఎఫ్‌టీ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించడం జరిగిందన్నారు. పొన్నాడ గ్రామంలో త్వరలోనే అత్యాధునిక సదుపాయాలతో శాశ్వత క్యాంపస్ నిర్మాణం కానున్న నేపథ్యంలో జిల్లాలో వివిధ శాఖల అధికారులు ఐఐఎఫ్‌టీ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఓఎస్డీ డాక్టర్ బాబురావు నాయుడు, కాకినాడ ఐఐఎఫ్టీ సెంటర్ హెడ్ వీ.రవీంద్రసారథి తదితరులు పాల్గొన్నారు.

బోగస్ రేషన్ కార్డులు ఏరివేతలో సివిల్ సప్లై అధికారుల విఫలం

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో బోగస్ రేషన్ కార్డులు ఏరివేతలో సివిల్ సప్లై అధికారులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. బిపిఎల్ కుటుంబాలకు అందవలసిన వైఏపీ కార్డులు పక్కదారి పడుతున్నా పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. ప్రభుత్వం వైఏపీ కార్డులను నిరుపేద కుటుంబంలో జీవిస్తున్న వ్యక్తులకు మంజూరు చేయాలని నిబంధన ఉంది. గత ప్రభుత్వంలో పెన్షన్ తీసుకుంటూ ఒక్కరే ఉండి వైఏపి కార్డు కలిగిన వ్యక్తులకు బియ్యం తొలగించారు. ఆ కార్డులను నిరుపేదలకు కేటాయించారు. కానీ నేడు పెన్షన్ పొందుతూ 35 కేజీల బియ్యం తీసుకుంటూ, సింగిల్ మాన్‌కి ఇవ్వడంపై నిరుపేద కుటుంబాల ప్రజలు అధికారుల తీరుపై ఆవేదన చెందుతున్నారు. కరప మండలంలో ఎండియు వాహనాలు 16 ఉండగా వాటితో ఇంటింటికి రేషన్ పంపిణీ చేయడం జరుగుతుంది. మండల వ్యాప్తంగా 45 మంది డీలర్లు ఉన్నారు. ఇందులో కొంతమంది ఆథరైజేషన్ లేకుండా సొంతింటిలో రేషన్ షాపులు నడుపుకుంటూ అధికారులకు ప్రతీ నెలా ముడుపులు చెల్లిస్తున్నారు. డీలర్లు వారికి ఇచ్చే స్టాకు ప్రకారం కమీషన్ ఇవ్వడం జరుగుతుంది. దీంతో చనిపోయిన వారి వివరాలు గానీ, ఫారిన్ దేశంలో నివసిస్తున్న వారి వివరాలు గాని ఇవ్వకుండా వారికి వచ్చే కనీసం కోసం గోప్యంగా ఉంచుతున్నారని పలువురు చెబుతున్నారు. రేషన్ బియ్యం అలాట్మెంట్ ఎండియు వాహనదారుడికి డీలర్ దగ్గరుండి ఇవ్వవలసి ఉన్నప్పటికీ సాయంత్రానికి సరిపడగా ఒకేసారి స్టాక్‌ను అప్పగించి డీలర్లు సొంత పని చేసుకుంటున్నారు. ఇది ప్రభుత్వ రూల్స్‌కి విరుద్ధం, ఏది ఏమైనా సింగిల్ డిజిట్ ఉన్న వైఏపీ కార్డుదారులను తొలగించి నిరుపేద బిపిఎల్ కుటుంబాలకు వాటిని తిరిగి అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నిడదవోలు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు వైద్యులను ఆదేశించారు. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు క్యాంపు కార్యాలయం నుండి ఉండ్రాజవరం మండలంలో ప్రభుత్వ నూతన భవనాలను ప్రారంభించడానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు బయలుదేరారు.మార్గం మధ్యలో నిడదవోలు ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని గమనించి ఆయన వెంటనే కారు దిగి దగ్గరుండి క్షతగాత్రులను 108 వాహనంలో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రభుత్వ వైద్యులతో ఆయన స్వయంగా మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. క్షతగాత్రులు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

చెట్టు నుండి జారిపడిన వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రమాదవశాత్తు చెట్టు నుండి జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు కొత్తపేట ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఖండ్రిగ గ్రామం పులుసు గంటి వారి పేటకు చెందిన పులుసు గంటి సత్యనారాయణ (50) గత నెల 20వతేదీన తన ఇంటి సమీపంలో ఉన్న మామిడి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడటంతో బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు ప్రేమ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గ్రామాలలో వారధి

విశాలాంధ్ర - కరప : ప్రజలకు ప్రభుత్వానికి మధ్య పోలీసులు వారధిగా పని చేస్తారని ఎస్సై నౌడు రామకృష్ణ తెలిపారు. కరప మండలం నడకుదురు, గొరిపూడి, గ్రామంలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలతో వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనర్ బాలలకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం సేవించి వాహనాలు నడిపితే పదివేల రూపాయలు జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని, ఎస్సై తెలిపారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినట్లయితే సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేగల లలిత కుమారి, ఎంపీటీసీ పైల రామ తులసి గోవిందు, గొరిపూడి గ్రామ సర్పంచ్ కానూరి రమాదేవి, చీకాల సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు చీకాల అప్పలరాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో గ్రంథాలయం సందడి

విశాలాంధ్ర - రాజానగరం : గ్రామంలోని చిన్నారులకు, విద్యార్థులకు గత 32 రోజులుగా ఉచితంగా అందిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. మండల కేంద్రమైన రాజానగరంలోని గ్రంథాల యంలో గురువారం అందించిన వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం,కథలు చెప్పడం,చిత్ర లేఖనంలో మెలుకువలు బోధించడంతో పాటు వివిధ రకాల బొమ్మలు తయారీ విధానాలు నేర్పించారు. దీనిలో భాగంగా శిక్షణకు హాజరైన 17మంది విద్యార్థులకు వివిధ అంశాలపై తర్ఫీదు అందించారు. ఈ సందర్భంగా స్థానిక లేనోరా దంత వైద్య కళాశాల విద్యార్థులు శిక్షణ శిబిరానికి హాజరై చిన్నారులకు దంత పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు దంత సంరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ పి.భారతి, బి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ

విశాలాంధ్ర-కొవ్వూరు : ఆంధ్రప్రదేశ్ జోన్-2 (నూతన 7 జిల్లాల) పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి. నాగమణి రాష్ట్ర హెూం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హెూం మంత్రి వారి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందించారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణల పై కాసేపు ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎం. తిరుమల దాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యంకండి

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించి నియోజకవర్గంలోని మూడు మండలాల అభివృద్ధికి ఎంపిడిఓలు కృషి చేయాలని నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఇటీవలే బదిలీ పై వచ్చి పదవి బాధ్యతలు చేపట్టిన నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండల అభివృద్ధి అధికారులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని శ్రీనివాసనాయుడు కోరారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో ఎంపిడిఓలు గా బాధ్యతలు చేపట్టిన పి.సామ్యూల్, జీవీఎస్ రామకృష్ణం రాజు, డి.దామోదర్ వున్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - అనపర్తి : ప్రకృతి వైపరీత్యాలతో ప్రతి ఏడాది ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాగు చేస్తున్న రైతుల సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నట్టు జడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి చెప్పారు. శుక్రవారం అనపర్తి, మండపేట నియోజకవర్గ పరిధిలోని కాలువలకు లాకుల గేట్లు తెరిచి పంట కాలువలకు నీటిని సత్తి రామారెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం రామారెడ్డి మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం పరిధిలో తాపేశ్వరం, అర్తమూరు, రాయవరం, వెదురుపాక గ్రామాలకు, అనపర్తి నియోజకవర్గం పరిధిలో పొలమూరు, మహేంద్రవాడ గ్రామాల మీదుగా పంట కాలువల నుండి రైతన్నకి నీటిని విడుదల చేయడం నెంబర్ 4 ఛానల్ ద్వారా సుమారు 15 వందల ఎకరాలకు, వెదురుపాక ఛానల్ ద్వారా 5 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ అజీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: జూన్ నెల మొత్తం మలేరియా నివారణ మాసోత్సవంగా నిర్వహిస్తున్నట్టు తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం ఉండ్రాజ వరం పి.హెచ్.సి., గ్రామ సచివాలయం పరిధిలోని ఏరియాలో ఫ్రైడే డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాక్టివిటీస్‌ను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియాను వ్యాప్తిచేసే ఎనాఫిలస్ దోమ కూడా నిలకడగా ఉన్న నీటిపై గుడ్లు పెడుతుందని, ఇవి 8 నుండి 10 రోజులలో దోమలు గా మారతాయని, ఇవి రాత్రిపూట కుడతాయన్నారు. ప్లాస్మోడియం పరాన్నజీవితో సంక్రమణం చెందిన ఈ ఎనాఫిలస్ ఫిమేల్ దోమలు కుట్టడం వలన మలేరియా వస్తుందన్నారు. చలి,జ్వరం, వణుకు ఈ వ్యాధి లక్షణాలు గా ఉంటా యన్నారు. ఈ దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే గా పాటించాలని. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వెంకటరాజు, గ్రామ ఆరోగ్య కార్యదర్శి మేరీ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి.నెం.758/2020-ఇ1. తేది. 09.06.2023.

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో యాభై రెండు (52) పనులకు రూ.270.13 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది. 09.06.2023. సా.07.00ల నుండి ముగింపు తేది. 23.06.2023 ఉ.10.30ల వరకు

మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

కమీషనరు
అమలాపురం పురపాలక సంఘం